క్లుప్తంగా

నిరుపయోగంగా బస్‌షెల్టర్



తాడూరు: మండల కేంద్రంలో ప్రయాణికుల సౌకర్యార్థం నాలుగేళ్ల కిందట బస్సు షెల్టర్ నిర్మించారు. అప్పటి ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి నిధులను మంజూరు చేశారు. నిర్మాణం పూర్తైనా ఇప్పటివరకు బస్‌షెల్టర్ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఎండలో రోడ్లపైనే నిల్చుంటున్నారు. బస్సుల కోసం గంటల తరబడి నిలబడి వేచి చూడాల్సిన దుస్థితి నెలకొందని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి నిర్మించిన బస్సు షెల్టర్‌ను ప్రారంభించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చలివేంద్రం ప్రారంభం



నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో సత్యసాయిసేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత చలివేంద్రాన్ని సమితి కన్వీనర్ హకీం విశ్వప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 సంవత్సరాలుగా వేసవిలో ఉచిత తాగునీటిని అందిస్తున్నామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు చల్లని మినరల్ వాటర్ సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈశ్వరయ్య, బాలకృష్ణ ,గంధం ప్రసాద్, శ్రీరాములు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత: కేసు నమోదు

ఉప్పునుంతల: మండల సరిహద్దులోని దుందుబీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం మండల కేంద్రంలో పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. లింగాల మండలం కొమటికుంటకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కుర్మయ్యపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ లెనిన్ తెలిపారు.

మహిళా ప్రయాణికులతో బస్టాండ్ కిటకిట



పెద్దకొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించడంతో బస్సులో ప్రయాణించేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో బస్టాండ్ ప్రాంగణాలు మహిళలతో కిటకిటలాడుతున్నాయి. ఉచిత ప్రయాణాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. బస్సులో పురుషుల కంటే మహిళలే అధికంగా ప్రయాణిస్తున్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల శ్రమదానం



తెలకపల్లి: మండలంలోని చిన్నముద్దునూర్‌లో విద్యార్థులు ఆదివారం శ్రమదానం చేశారు. నాగర్‌కర్నూల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్ విద్యార్థులు రెండోరోజు ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నీటి ట్యాంక్ వద్ద పాఠశాల ఆవరణ తదితర ప్రాంతాలలో విద్యార్థులు చెత్తచెదారం తొలగించారు. పరిసరాలను పరిశుభ్రం చేశారు. వేసవికాలంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు సేవా దృక్పథంతో మెలగాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు

లింగాల: మద్యం తాగి వాహనాలను నడుపుతున్న ఘటనలో మూడు కేసులను నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. మండలంలోని రాయవరం చౌరస్తాలో ఆదివారం వాహనాలను తనిఖీలు చేయగా మద్యం తాగి వాహనాలను నడుపుతున్న వ్యక్తులు పట్టుబడ్డారన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత



కనకాల మైసమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



పెనిమిళ్లలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

బల్మూర్: ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని జీన్‌కుంట కనకాల మైసమ్మను ఆయన సతీమణి అమ్రాబాద్ జెడ్పీటీసీ అనురాధతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైసమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

పెద్దకొత్తపల్లి: నాయనోనిపల్లి మైసమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. ఆదివారం గద్వాల, వనపర్తి, కొల్లాపూర్, అచ్చంపేట, నాగర్‌కర్నూల్, పెబ్బేరు ప్రాంతాల నుంచి భక్తులు ప్రైవేటు వాహనాలలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కొత్తగా కొనుగోలు చేసిన వాహనాలను ఆలయ చుట్టూ తిప్పి పూజలు చేశారు. అమ్మావారికి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో వెలిసిన తినుబండారాల దుకాణాలు వద్ద భక్తులు సందడి చేశారు. మొత్తం ఎనిమిది వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఎండోమెంట్ అధికారి రంగారావు పేర్కొన్నారు.

ఘనంగా పెద్దమ్మ అమ్మవారి బోనాలు

ఉప్పునుంతల: మండలంలోని ఫిరట్వానిపల్లి, పెనిమిళ్ల గ్రామాల్లో ఆదివారం సాయంత్రం యాదవుల కులదైవం పెద్దమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఫిరట్వానిపల్లిలో నూతనంగా చేపట్టిన పెద్దమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా బోనాల పండుగను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో యాదవ మహిళలు అలంకరించిన బోనాలను తలపై పెట్టుకొని ఊరేగింపుగా పెద్దమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఫిరట్వానిపల్లిలో యాదవ సంఘం నాయకులు తోళ్ల కృష్ణయ్య, పెంటయ్య, దొడ్ల అంజనేయులు, వెంకట్‌నారాయణ, గంధం చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈదమ్మ మాందాత కల్యాణోత్సవం

చారకొండ: మండలంలోని చంద్రాయన్‌పల్లిలో ఆదివారం ఈదమ్మ మాందాత కల్యాణ వేడుకను అంరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని విద్యుత్‌దీపాలతో, మామిడి తోరణాలతో అలంకరించారు. పురోహితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణతంతు కొనసాగింది. గ్రామస్తులు కల్యాణ వేడుకను తిలకించేందుకు అధికసంఖ్యలో తరలివచ్చారు. రాత్రి వడ్డెరకులస్తుల మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జంగయ్య, నర్సింహ్మా, కృష్ణయ్య, రమేష్, బాలస్వామి, మహిళలు తదితరులు ఉన్నారు.



నాయనోనిపల్లిలో..



ఫిరట్వానిపల్లిలో

రైతులకు మెరుగైన సేవలు అందిస్తాం



మాట్లాడుతున్న సీఈఓ అంజనేయులు

తాడూరు: రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని సింగిల్ విండో అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సింగిల్‌విండో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సీఈఓ అంజనేయులు వార్షిక నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా సంఘం లావాదేవీలపై రైతులకు నాణ్యమైన సేవలపై సభ్యులతో చర్చించారు. ఇచ్చిన నివేదికలో సరైన డాటా ఉండేవిధంగా చూడాలని డైరెక్టర్ రామచంద్రారెడ్డి అన్నారు. అనంతరం అధ్యక్షుడు మాట్లాడుతూ స్వల్పకాలిక రుణాల ద్వార 1121 మందికి రూ.4.70 కోట్ల రుణాలు డీసీసీబీ ద్వారా రుణాలు తీసుకొన్నారన్నారు. 2023–24 సంవత్సరానికి 355 మంది సభ్యులకు రూ.1.36 కోట్ల రుణమాఫీ అయ్యిందన్నారు. 125 మంది సభ్యులకు రూ.1.18 కోట్లను సంఘం ద్వార ఇచ్చామని అన్నారు. దీర్ఘకాలిక రుణాల ద్వార సంఘానికి రూ.1.65 కోట్లు రికవరీ చేయాల్సి ఉందన్నారు. రైతుల నుంచి సంఘానికి వచ్చే రుణాల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. యాసంగి సీజన్‌లో 2.68 లక్షల యూరియా బస్తాలు రైతులకు అందజేమన్నారు. సంఘం బలోపేతానికి రైతులు సహకరించాలని కోరారు. సమావేశంలో విండో సూపర్‌వైజర్ రాఘవేందర్, డైరెక్టర్‌లు యాదగిరి, రమేష్, కృష్ణయ్య, సమ్మద్‌పాషా, శేఖర్‌రెడ్డి, లక్ష్మి, తిరుపతయ్యలతో పాటు కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

హోమియో ఆస్పత్రి గ్రామీణులకు వరం



వైద్యుడు హేమంత్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

మన్ననూర్: స్థానికంగా ఉన్న ఈకే హోమియో ఆస్పత్రి సేవలు గ్రామీణులకు వరంగా మారిందని ఆర్యవైశ్య మహాసభ నాయకులు వెంకటరమణ, సత్యనారాయణలు అన్నారు. ఆదివారం పూణెకు చెందిన హోమియో వైద్య నిపుణులు, రామచంద్రదేవ్ ట్రస్టు వైద్యుడు హేమంత్ ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు, నాణ్యమైన హోమియో మందులు అందజేయడంతో పాటూ రోగులకు భోజన ఏర్పాట్లు కూడా ట్రస్టు ద్వారా అందించడం అభినందనీయమన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో హోమియో ఆస్పత్రి ఇది ఒక్కటే ఉండటంతో ప్రజల నుంచి ఆదరణ ఉందని ఆర్యవైశ్యసభ నాయకులు పేర్కొన్నారు. అనంతరం వైద్యాధికారి హేమంత్‌ను శాలువాతో సన్మానించి భగవద్గీతను బహూకరించారు. అనంతరం ఆస్పత్రికి వచ్చిన రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంబు శ్రీను, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కంకర రోడ్డుతో తప్పని తిప్పలు



చెదురుపల్లి-వెల్దండ రోడ్డు ఇలా

వెల్దండ: మండలంలోని చెదురుపల్లి, నగారగడ్డతండా వద్ద బీటీ రోడ్డు నిర్మాణంలో భాగంగా పనులు చేపట్టారు. సంబంధిత కాంట్రాక్టర్ కంకర వేసి బీటీ నిర్మాణ పనులు చేపట్టలేదు. రెండేళ్లు గడుస్తున్న ఇప్పటికి పనులు పూర్తి కాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. కంకర తేలిన రోడ్డుపై ప్రయాణించేందుకు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలువురు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి బీటీ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి

చారకొండ: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం అచ్చంపేట నియోజకవర్గంలో బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశానికి మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచంద్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

విద్యుత్ తీగలు తొలగించండి

తెలకపల్లి: మండల కేంద్రంలోని గణేష్‌నగర్ కాలనీలో విద్యుత్ తీగలు, స్తంభాలు ప్రమాదభరితంగా దర్శనమిస్తున్నాయి. కాలనీలో ఉన్న విద్యుత్ స్తంభం విరిగింది. విద్యుత్ తీగలు కాలనీలోని కానుగ చెట్టుపై ఉండడంతో కొంతమంది చిన్నారులు ఆడుకుంటూ విద్యుదాఘాతానికి గురైన ఘటనలు ఉన్నాయి. ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభం, తీగలను తొలగించాలని చిన్నారుల తల్లిదండ్రులు, కాలనీవాసులు కోరుతున్నారు. సంబంధిత అధికారులకు సమస్యను విన్నవించినా పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. చిన్నారులతోపాటు మరో వ్యక్తికి విద్యుదాఘాతానికి గురైనట్లు స్థానికులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మార్కెట్ చైర్మన్‌గా అవకాశం ఇవ్వాలి

చారకొండ: కల్వకుర్తి మార్కెట్ చైర్మన్‌గా అవకాశం కల్పించాలని నాగర్‌కర్నూల్ డీసీసీ ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్య యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని జూపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా పది సంవత్సరాలు పని చేసినట్లు గుర్తు చేశారు. జూపల్లి సర్పంచ్‌గా, ఎంపీటీసీగా సేవలు అందించానని పేర్కొన్నారు. కల్వకుర్తి, అచ్చంపేట ఎమ్మెల్యేల గెలుపునకు కృషి చేశానని వివరించారు. బీసీ కోటాలో కల్వకుర్తి మార్కెట్ చైర్మన్‌గా అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రామచంద్రి, మల్లయ్య, జంగయ్య, రాజు యాదవ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

కళాకారులకు ఉగాది పురస్కారాలు



కొల్లాపూర్: చిన్నచింతకుంట మండలంలోని కురుమూర్తి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో ఉగాది పర్వదినం సందర్భంగా సాహితీ, సాంస్కృతిక, సేవా రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి ఆదివారం ఆలయంలో పురస్కారాలు అందజేశారు. కొల్లాపూర్‌కు చెందిన నాటక రంగ కళాకారులు జీకే.వెంకటేష్(ఫార్మాసిస్టు), ఆమని కృష్ణ(ఉపాధ్యాయుడు)కు పురస్కారాలను అందుకున్నారు.

బీఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శిగా దాసు



కొల్లాపూర్: బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శిగా కుడికిళ్ల గ్రామానికి చెందిన బి.దాసు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘ జాతీయ కోఆర్డినేటర్ కరుణాకర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా దాసు మాట్లాడుతూ బహుజన విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. దాసు నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

దొంగతనం నెపంతో బాలుడిపై దాడి

అమ్రాబాద్: దొంగతనం నెపంతో ఓ బాలుడిని చితకబాదిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం పదర మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన నేనావత్ నర్సింహ నివాసంలో ఐదు రోజుల కిందట రూ.70 వేలు చోరీకి గురయ్యాయి. ఆదివారం గ్రామానికి చెందిన బాలుడిపై అనుమానంతో చితకబాదారు. కాని డబ్బులు తీయలేదని తెలపడంతో వదిలేశారు. అనంతరం నర్సింహ కుటుంబానికి చెందిన మరో బాలుడు తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయం ఆ బాలుడు ఒప్పుకునట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు రాలేదని ఎస్ఐ రాజు తెలిపారు.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం



బిజినేపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి



అచ్చంపేటలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

బిజినేపల్లి: ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఫుల్ గోస్పెల్ చర్చిలో నిర్వహించిన ఈస్టర్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. ఇతరులతో కరుణ, ప్రేమపూర్వకంగా మెలగాలన్నారు. ఈ సందర్భంగా పాస్టర్ ఈస్టర్ సందేశాన్ని వినిపించారు. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని షాలేం ఎంబీ చర్చిలో ఈస్టర్ పండుగ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ పరంజ్యోతి మాట్లాడుతూ ఏసుక్రీస్తు పాపము, మరణం నుంచి రక్షించుటకు శిలువపై మరణించాడన్నారు. కార్యక్రమంలో జేమ్స్, అబ్షాలేం, కరుణాకర్, భాస్కర్, శాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

దోమలపెంట: ఏసుక్రీస్తు పునరుత్థానం పురస్కరించుకుని ఈస్టర్ పండుగను క్రైస్తవులు నిర్వహించారు. స్థానిక క్రిస్టియన్ సెంటర్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ రెవె.డా.ఆశీర్వాదం పండుగ సందేశం తెలిపారు.

ప్రత్యేక ప్రార్థనలు

కల్వకుర్తి టౌన్: ఏసుక్రీస్తు పునరుత్థాన దినం సందర్భంగా క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను నిర్వహించుకున్నారు. పట్టణంలోని ఎంబీ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ రాజు ప్రత్యేకంగా దైవ సందేశాన్ని చదివి వినిపించారు. కార్యక్రమంలో క్రైస్తవులు, చర్చి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న గౌరవ అధ్యక్షుడు వీరాచారి

తాడూరు: గ్రామీణ ప్రాంతాల్లోని విశ్వబ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు వీరాచారి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని చెన్నకేశవ ఆలయ ఆవరణలో మండల స్థాయి విశ్వబ్రాహ్మణ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఏర్పాటులో విశ్వబ్రాహ్మణులు కీలక పాత్ర వహించారని గుర్తుచేశారు. ఎలాంటి షరతులు లేకుండా విశ్వబ్రాహ్మణుల కుటుంబాలకు ఆయా బ్యాంకుల ద్వార రుణాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఆయా గ్రామాల సంఘం నాయకులు భాస్కరాచారి, రమేష్, మల్లాచారి, రామాచారి, కృష్ణమాచారి, శ్రీనివాసులు, అనంత రాములు, చంద్రమౌళి, ప్రవీన్ పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు



చారకొండలో

అచ్చంపేట రూరల్: పట్టణంలోని వై రోడ్డు చౌరస్తాలో ఆదివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని రెండో ఎస్ఐ శివయ్య సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చారకొండ: వాహనదారులు రోడ్డు నిబంధనలు, ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాజశేఖర్ హెచ్చరించారు. మండల కేంద్రంలో ఆదివారం కల్వకుర్తి –దేరకొండ ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా సంబంధిత పత్రాలు ఉండాలని సూచించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి వాహనాన్ని క్షుణంగా పరిశీలించి, తనిఖీలు చేపడుతున్నామన్నారు. తనిఖీలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న శేఖర్ రెడ్డి

వెల్దండ: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ శేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పోలింగ్ బూత్‌స్థాయి అధ్యక్షులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఏర్పాటు చేసిన మైక్రో డోనేషన్ యాప్ ద్వారా పార్టీకి విరాళాలను అందించాలన్నారు. ప్రతి కార్యకర్త వ్యక్తిగతంగా యాప్ ద్వారా విరాళాలు పంపించాలన్ని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాల్లో పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని కోరారు. అనంతరం విరాళాలను సేకరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కుర్మిద్ద యాదగిరి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచారి, నాయకులు జంగయ్య, బాలస్వామి, రామస్వామి శశిధర్‌రెడ్డి, రవి కుమార్, వెంకటేష్, వెంకటయ్య, మధుసూదన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, విష్ణు, వెంకటయ్య, పెంటయ్య, నరేష్ తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీదే విజయం సాధిస్తుందని ఆ పార్టీ జిల్లా నాయకుడు నరేంట్ల శేఖర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ స్థానాలలో పోటీ చేస్తున్న భరత్‌ప్రసాద్, డీకే అరుణల గెలుపు తథ్యమని జోస్యం చెప్పారు. ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. మూడోసారి ప్రధాని నరేంద్రమోదీ అయ్యేందుకు ప్రతిఒక్కరూ బీజేపీని ఆదరించాలని కోరారు.

ప్రమాదభరిత గుంతను పూడ్చండి



వీపనగండ్ల: మండలంలోని వంటిమిట్ట తండాలో మిషన్ భగీరథ పైపులైన్ల మరమ్మతు కోసం తవ్విన గుంతను పూడ్చకపోవడంతో ప్రమాదం పొంచి ఉందని తండావాసులు ఆవేదన చెందుతున్నారు. ప్రమాదకర గుంతను పూడ్చాలని పంచాయతీ సిబ్బందిని అడిగితే భగీరథ పనుల రిపేర్ కోసం ఒకటే జేసీబీ ఉందని, అది వస్తేనే గుంతను పూడ్చేందుకు వీలు అవుతుందని అంటున్నారని తండావాసులు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గుంతను పూడ్చి చదును చేయాలని తండావాసులు కోరుతున్నారు.

హరితహారం చెట్లకు నిప్పు



పాన్‌గల్: మండలంలోని రాయినిపల్లి, బుసిరెడ్డిపల్లి గ్రామాల మధ్య ఉన్న పీఆర్ రోడ్డు పక్కన హరిత హారంలో పెంచిన చెట్లకు మంటలు అంటుకొని బూడిద అవుతున్నాయి. రోడ్డు పక్కన ఉన్న హరితహారం చెట్లకు పక్కనే ఉన్న పంట పొలాల్లోని వరి కొయ్యలకు రైతులు నిప్పు పెట్టడంతో ఆ మంటలు అలానే వ్యాపించి పక్కనే ఉన్న హరితహారం చెట్లకు అంటుకొని చెట్లు కాలిపోతున్నాయి. రోడ్డు పక్కనే ఉన్న పంట పొలాల రైతులకు తమ పొలాల్లోని వరి కొయ్యలు, చెత్తను అంటించే సమయంలో మంటలు పక్కనే ఉన్న హరితహారం చెట్లకు వ్యాపించకుండా తగు జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పిస్తే ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవని, పెరిగిన చెట్లకు నష్టం వాటిల్లిదని పలువురు అభిప్రాయ పడుతున్నారు.